ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★ బుధవారం 8 మే 2024

రైతుబంధును అడ్డుకున్న బీజేపీ, బీఆర్ఎస్ 8లో..

కేంద్రంలో మూడోసారి మోదీ సర్కార్ 8లో..

మారుతున్న రాజకీయ సమీకరణాలు

- కాంగ్రెస్‌లో పెరుగుతున్న చేరికలు
- బీఆర్ఎస్‌ను వీడుతున్న నాయకులు
- బీజేపీని వెంటాడుతున్న వర్గవిభేదాలు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో ఆయా పార్టీల నుంచి జంపు జిలానీలు పెరుగుతున్నారు. దీంతో పెద్దపల్లి పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి.వివిధ పార్టీల నాయకుల చేరికలతో కాంగ్రెస్ పార్టీలో జోష్ ఉండగా, బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఆ పార్టీని వీడుతుండడంతో పార్టీ కార్యకర్తల్లో స్థైర్యం దెబ్బ తింటున్నది. భారతీయ జనతా పార్టీ అభ్యర్థిని వర్గ విభేదాలు వెంటాడు తున్నాయి. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎన్నికల ప్రచారం ముందుకు సాగడం లేదు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి ఈ ఎన్నికల్లో 42 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇందులో ప్రధా నంగా బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీజేపీ నుంచి గొమాసే శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. వీరి మధ్యే ప్రధానంగా పోటీ నెలకొన్నది.. పార్లమెంటు నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరగగా, ప్రస్తుతం జరుగుతున్నది 18వ ఎన్నిక. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పదిసార్లు, తెలుగుదేశం పార్టీ నాలుగుసార్లు, బీఆర్ఎస్ పార్టీ రెండుసార్లు, ఒకసారి తెలంగాణ ప్రజా సమితి అభ్యర్థి గెలుపొందారు. ఇక్కడి నుంచి భారతీయ జనతా పార్టీ మూడోసారి మాత్రమే పోటీచేస్తున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవడంతో ఈ ఎన్నికల్లో గెలుపొందడం నల్లేరు మీద నడకేనని ఆ పార్టీ నాయకులు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేసిన అనుభవంతో పాటు ఆయన కూడా సింగరేణి కార్మికుడు కావడం గమనార్హం. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలన గురించి వివరిస్తూ అయన ఓట్లు అభ్యర్థిస్తున్నప్పటికీ, పార్టీకి చెందిన పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులు కలవరానికి గురవుతున్నారు. బీజేపీకి చెందిన కొందరు నేతలు సైతం కాంగ్రెస్‌లో చేరుతున్నారు.

కేడర్‌లో జోష్..

కాంగ్రెస్ అభ్యర్థి తరఫున రాజారంపల్లిలో జన జాతర సభ జరగగా, ఈ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై పార్టీ క్యాడర్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడంతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే సీపీఐ, సీపీఎంలు మద్దతు ఇస్తుండడం ఆ పార్టీకి కలిసివస్తున్నది. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పక్షాన ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఇటీవల గోదావరిఖని, మంచిర్యాలలో రోడ్ షో నిర్వహించి ఆ పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపారు. అయితే అభ్యర్థి తరఫున పార్టీ కేడర్, కాంగ్రెస్ పార్టీ కేడర్ నిర్వహిస్తున్నట్లుగా ప్రచారం చేయడం లేదు. అలాగే అయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, ఆ నియోజకవర్గాల్లో ఉన్నటువంటి సీనియర్ నాయకులను కలుపుకుని వెళ్లకపోవడం కూడా పార్టీకి ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు నాయకులు పార్టీని వీడుతుండడం కలవడానికి గురిచేస్తున్నది. సింగరేణి కార్మికుడిగా పని చేసిన కొప్పుల ఈశ్వర్ ఆ వర్గానికి చెందిన ఓటర్లు తనకు మద్దతుగా నిలుస్తున్నారని ఆశిస్తున్నారు. పదేళ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, తనపై ఉన్న సానుభూతి ఎన్నికల్లో విజయ తీరానికి చేరుస్తాయని భావిస్తున్నారు. అయితే గ్రామీణ ఓటర్ల నాడీ మాత్రం బీఆర్ఎస్‌కు చిక్కడం లేదు. బీజేపీ అభ్యర్థి తరఫున గొమాసే శ్రీనివాస్ తరఫున పెద్దపల్లిలో నిర్వహించిన బహిరంగ సభకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా హాజరై, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టారు. మంగళవారం మంథనిలో జన గర్జన సభా ప్రాంగణంలోని టెంట్లు, కుర్చీలు, కూలర్లు గాలిదుమారంతో కూలిపోయాయి. దీంతో జనం వెళ్లిపోయారు. సభకు రావాల్సిన రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఆలస్యంగా రావడంతో సభ జరగకుండాపోయింది. అక్కడ పార్టీ కార్యకర్తలు, కొద్దిపాటి జనం ఉండడంతో వారిని ఉద్దేశించి ప్రసంగించారు. అయితే పెద్దపల్లి సభతో కొంత ఊపు వచ్చినప్పటికీ, ఆ పార్టీకి పార్లమెంటు పరిధిలో బలమైన కేడర్ లేని కారణంగా క్షేత్రస్థాయిలో ఆశించిన దానికంటే ప్రచారం తక్కువే అవుతున్నది. దీనికి తోడు పెద్దపల్లి, రామగుండం తదితర ప్రాంతాల్లో పార్టీలో వర్గ విభేదాలు నెలకొన్నాయి. నేతల మధ్య సమన్వయం కొరవడింది. దింతో అభ్యర్థి శ్రీనివాస్ కొట్టుమిట్టాడుతున్నారు. ఈసారి నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరవేస్తామనే ధీమాను బీజేపీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఓటర్లు ఎవరిని విజయ తీరం చేరుస్తారో వేచిచూడాలి.

కార్మికులకు న్యాయం చేస్తాం

పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ

శ్రీరాంపూర్, మే 6: పెద్దపల్లి ఎంపీగా తనను గెలిపిస్తే సింగరేణి కార్మికులకు న్యాయం చేస్తామని పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఆర్‌కె 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఏఐ టీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య హాజరై మాట్లాడారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మాఫీ, సొంతింటి పథకం అమలు చేయిస్తామని, కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు ఇప్పిస్తామన్నారు. కార్మికులు ఐకమత్యంతో చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వీరభద్రయ్య, సమ్మయ్య, బాజీసైదా, కిషన్ రావు, సంపత్, రాచర్ల చంద్రమోహన్ పాల్గొన్నారు. గడ్డం వంశీ కృష్ణకు వద్దతుగా ఐఎన్‌టీ యూసీ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పి 3, 3ఏ గనిపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. భీంరావు, గరిగె స్వామి, శ్యామ్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పదేండ్ల బీజేపీ పాలనలో దేశ ప్రగతి దెబ్బతిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మందమర్రికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ పాలనకు, కేంద్రంలో బీజేపీ పాలనకు తేడా ఏమి లేదన్నారు. మోదీకి అదాని, అంబానీ తప్ప ప్రజలు అవసరం లేదన్నారు.

భీమారం: పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి కోరారు. కొత్త చెరువు వద్ద ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. పోతనపల్లి, బూరుగుపల్లి, నర్సింగాపూర్, కాజీపల్లి, దాంపూర్, ధర్మారం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లు వేయాలని కోరారు.

కళ్యాణ్‌నగర్ : కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గారికి భారీ మెజార్టీతో గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వాకర్స్, క్రీడాకారులను కోరారు. మంగళవారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వాకర్స్‌ను, క్రీడాకారులను కలుస్తూ కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకు మద్దతుగా మండలంలోని సుద్దాల, రేగడిమద్దికుంట, రామునిపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే విజయరమణారావు ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు చిలుక సతీష్, అంతటి అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, దామోదర్‌రావు, పన్నాల రాములు, ఇల్లెందు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌కె 7 గనిపై మాట్లాడుతున్న వంశీకృష్ణ

పాలకుర్తి : పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కోరారు. మంగళవారం మండలం పరిధిలోని కొత్తపల్లె,ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలను కలుసుకోవడంతో పాటు బసంత్‌నగర్ కేశోరాం ప్రధానద్వారం ముందు నిర్వహించిన సభలో పాల్గొన్నారు. రామగుండం నియోజకవర్గ ప్రజలు గడ్డం వంశీని భారి మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, కేశోరాం యూనియన్ నాయకులు సూర సమ్మయ్య, బయ్యపు మనోహర్‌రెడ్డి, దాడి మహేష్, ఎంపీటీసీ గంగాధరి రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ : పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా నాయకత్వంలో నాయకులు ఎన్టీపీసీలో ప్రచారం చేశారు. కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి భూమల్ల చందర్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ పీటీఎస్, అన్నపూర్ణకాలనీ, మేడిపల్లి సెంటర్, కృష్ణానగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఎం.డి.జమీన్, పి.శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, దుర్గయ్య, రాములు, అంజిత్, ఎం.డి.అలీ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని రత్నాపూర్, సెంటినరీకాలనీ, కల్వచర్లలోని కృష్ణానగర్‌లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రచారం చేపట్టారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క, ముస్త్యా శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.



గోదావరిఖనిలో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



రేగడిమద్దికుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

అకాల వర్షం.. తడిసిన ధాన్యం..



ఎలిగేడులో ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతున్న రైతులు



ఎర్రగుంటపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



కాల్వశ్రీరాంపూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యం

జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో మంగళవారం గాలి దుమారంతో కూడిన వర్షం పడింది. పెద్దపల్లిలో వడగళ్లు కూడా కురిశాయి. ఈ వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిశాయి. చాలా చోట్ల ధాన్యం కుప్పలు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. అలాగే కోసి ఆరబోసుకున్న ధాన్యం తడవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. గాలి దుమారంతో కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఎలిగేడు, మే 7 : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి చిరు జల్లులతో మొదలైన ఉరుములు, మెరుపులు ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం, సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎంతో వేడిమి తట్టుకొని ఒకేసారి వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రైతులు పండించిన పంట కొనుగోలు కేంద్రాల్లోనే ముగుతోంది. ఒకేసారి వర్షం తీవ్రమైన గాలి వీచడంతో వడ్లు తడిసిపోయి టార్పాలిన్లు కొటుకుపోవడంతో రైతులు అసహానానికి గురయ్యారు. వారం రోజులు వర్షం పడకుంటే వడ్లు అమ్ముకునే వారమని రైతులు పేర్కొన్నారు. ఇంకా వర్షం ఎక్కువ పడి వడ్లు తడిస్తే ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్‌తోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం,సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం ఉరుములు మెరుపులతో కూడిన వానలు కురువగా సాయంత్రం ఒక్కసారిగా తుఫాను వేగంతో వీచిన గాలులతో కూడిన భారీ వర్షం పడింది. రోడ్లపై వరద పారింది. కొన్ని రోజుల నుంచి ఎండల తీవ్రతతో, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించగా, రైతులకు మాత్రం కొంత నష్టాన్ని కలిగించింది. మండలంలోని సుద్దాల, కదంబాపూర్, రేగడి మద్దికుంట, కనుకుల, రామునిపల్లి తదితర గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. కొనుగోలు కేంద్రాలలో అక్కడక్కడా ఉన్న ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. ఉదయం వాతావరణం చూసి రైతులు ముందు జాగ్రత్తగా ధాన్యం కుప్పలపై కవర్లను కప్పుకున్నారు. దీంతో కొంత నష్టం జరగకుండా కాపాడుకున్నారు.

పాలకుర్తి : మండలం పరిధిలో మంగళవారం సాయంత్రం భారీ ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన అకాల వర్షానికి రైతులు ఆగమాగం అయ్యారు. వివిధ గ్రామాల్లోని రైతులు కల్లాల వద్ద ఆరబోసిన ధాన్యం తడుస్తుందని రైతులు ఉరుకులు, పరుగులతో కవర్లు తెచ్చి కప్పి ధాన్యాన్ని కాపాడుకున్నారు. పుట్నూర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగెలపై చెట్టు మండలు విరిగి పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గమనించిన అధికారులు అప్రమత్తమై మరమ్మతులు చేపట్టి విద్యుత్ పునరుద్ధరించారు.

ధర్మారం : మండలంలో మంగళవారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసింది. ఎర్రగుంటపల్లి, ధర్మారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో పాటు వడగండ్ల వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసి ముద్దయ్యాయి. నిట్టూరులో నిర్మించిన శ్మశానవాటికపై కప్పు ఈదురుగాలులకు కొట్టుకుపోగా, తాటిచెట్టు నేలవాలింది. కొత్తపల్లిలో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం ఆరబోసిన ప్రాంతంలో వర్షపు నీరు నిలిచి పూర్తిగా తడిసిపోయింది. హన్మంతునిపేట, పెద్దకల్వల, రాంపల్లి, బొంపల్లి, నిమ్మనపల్లి గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. దీంతోపాటు పలు ప్రాంతాల్లో ధాన్యం తడిసిముద్దయిందని, తడిసిన ధాన్యంను కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలో కురిసిన భారీ వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. రైతులు పరదాల కోసం ఇంటివైపు పరుగులు తీశారు. పరదాలు తీసుకవచ్చేలోపే భారీ వర్షం కురువడంతో పలు గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయింది. దీంతో రైతన్నలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

మంథని : వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా మంథని డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో మంగళవారం గాలి దుమారంతో పాటు స్వల్పంగా వర్షం కురిసింది. ఒక్కసారిగా గాలి దుమారం పెద్దఎత్తున రావడంతో పాటు ఇదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లోని వరి పొలాల్లోని వరి ధాన్యం కుప్పలు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు స్వల్పంగా తడిచిపోయాయి. రైతులు వెంటవెంటనే అప్రమత్తంగా ధాన్యం కుప్పలు తడవకుండా టార్పాలిన్లు కప్పుకొని జాగ్రత్తపడ్డారు.

నేలరాలిన మామిడికాయలు..

కాగా, గాలిదుమారంతో పలు గ్రామాల్లో మామిడి తోటల్లోని కాయలు రాలి కిందపడ్డాయి. దీంతో రైతులకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. పక్షం రోజులుగా ఎండ వేడిమితో అల్లాడిన జనానికి చల్లబడ్డ వాతావరణం ఉపశమనాన్ని ఇచ్చింది.



నిట్టూరులో కొట్టుకుపోయిన శ్మశానవాటిక రేకులు



కొత్తపల్లిలో ధాన్యం కుప్పల మధ్య నిలిచిన నీరు









అక్రమంగా మొరం తరలింపు

● ఎక్స్‌కావేటర్, రెండు ట్రాక్టర్లు సీజ్

మెట్‌పల్లి, మే, 7: అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. మంగళవారం మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన రేగుంట శివారులోని మైసమ్మ గుట్ట నుంచి అక్రమంగా మొరం తవ్వి తరలిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మైసమ్మ గుట్టను తవ్వడానికి ఉపయోగించిన జేసీబీ, తవ్విన మొరాన్ని తరలించడానికి ఉపయోగించిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టిన పూదరి నర్సాగౌడ్‌పై కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేశామన్నారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కొండపల్లి మారుతి ఇంట్లో అక్రంగా నిల్వ ఉంచిన ఐదు క్వింటాల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన మారుతీపై కేసు నమోదు చేసి పట్టుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు

● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మే 7: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ ధాన్యాన్ని తరలించడానికి చర్యలు చేపడతామన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వడగళ్ల వానతో జరిగిన పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం విడుదల చేశామన్నారు. రైతు భరోసాపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఆపారన్నారు. రైతాంగానికి సంబంధించిన సమస్య ఉత్పన్నమైనప్పుడు ప్రభుత్వం స్పందిస్తుందన్నారు. తాను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడానని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

వడదెబ్బతో నేత కార్మికుడి మృతి


బేతి కిష్టయ్య (ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 7: సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన నేతకార్మికుడు బేతి కిష్టయ్య (70) వడదెబ్బకు గురై మంగళవారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల తెలిపిన వివరాల ప్రకారం... గణేశ్‌నగర్‌కు చెందిన బేతి కిష్టయ్య సాంచలు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కిష్టయ్య ఆదివారం వడ దెబ్బ తగిలి అస్వస్థత పాలయ్యాడు. కుటుంబ సభ్యులు నేత కార్మికుడిని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. కిష్టయ్య భార్య రాజవ్వ, కూతురు మమత, కుమారుడు సంపత్ ఉన్నారు.

విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు కంట్రోల్‌రూం

గణేశ్‌నగర్, మే 7: జిల్లాలో విద్యుత్ సరఫరాను పర్యవేక్షించడానికి ఇన్‌ఛార్జి ఏఈ, సబ్ ఇంజనీర్‌లతో ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో రౌండ్ ది క్లాక్ కంట్రోల్ రూమ్ ప్రారంభించినట్లు ఎస్ఈ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 94408 11444లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. ఎవరైనా వినియోగదారుడు విద్యుత్ సరఫరా సమస్యను ఎదుర్కొంటే స్థానిక ఏఈని సంప్రదించాలని సూచించారు. ఏఈ నంబర్ సీసీ బిల్లులోఉంటుందని తెలిపారు. ఆ నంబర్‌కు ఫోన్ చేసి వారి సమస్యలను తెలియజేయాలన్నారు. అయినా సమస్య పరిష్కారం కాకపోతే కంట్రోల్ రూం నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

నగరంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురసి చెట్ల కొమ్మలు, ఫ్లెక్సీ బ్యానర్లు విద్యుత్ వైర్లపై పడడంతో పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. అధికారులు, సిబ్బంది స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని తెలిపారు. డీఈలు, ఏడీలు, ఏఈలు, క్షేత్రస్థాయి సిబ్బంది లైన్లపై పడిన బ్యానర్లను, చెట్ల కొమ్మలను తొలగించారన్నారు. మంగళవారం సాయంత్రం 6:30 గంటల వరకు నాలుగు 11/ కేవీ స్తంభాలు, తనుగుల వద్ద ఐదు స్తంభాలు దెబ్బతిన్నాయని తెలిపారు. వాటిని సరిచేసి త్వరలో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు.

ఈత వనం దగ్ధం

మెట్‌పల్లి రూరల్, మే 7: మండలంలోని బండ లింగాపూర్ శివారులోని ఈతవనం మంగళవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఈతవనంలోని చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు గీత కార్మికులు తెలిపారు. ఉపాధి కోసం పెంచుకున్న ఈతవనంలోని చెట్లు కాలిపోవడంతో తమకు ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికులు కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మల్యాల, మే 7: మండలంలోని రాంపూర్ శివారులో పేకాట ఆడుతున్న జగిత్యాలకు చెందిన అయిదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 26,930 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.



పోలీసు తనిఖీల్లో నగదు పట్టివేత


కరీంనగర్‌లో పట్టకున్న నగదును చూపెడుతున్న టూటౌన్ సీఐ విజయ్‌కుమార్


కరీంనగర్ క్రైం, మే 7: కరీంనగర్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాలు లేని రెండు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల డెబ్బై రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అక్రమ డబ్బు, మద్యం సరఫరా అరికట్టేందుకు ఇందిరా చౌక్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో 2,57,870 రూపాయలు పట్టుబిడనట్లు తెలిపారు. కరీంనగర్ కొత్తపల్లి హవేలీకి చెందిన మామిడాల సతీష్ వద్ద సరైన ఆధారాలులేని రెండు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల డెబ్బై రూపాయలను పట్టుకుని స్వాధీన పరుచుకున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన డబ్బును అధికారుల వద్దకు తరలించామని తెలిపారు.

హుజూరాబాద్‌లో..

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.1.10లక్షల నగదు పట్టుకున్నట్లు టౌన్ సీఐ రమేష్ తెలిపారు. హుజూరాబాద్ మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన బొల్లవేని సమ్మయ్య ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా రూ.1.10లక్షలు పట్టుకొని సీజ్ చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రూ.50వేల నగదు కంటే ఎక్కువ తీసుకెళ్లకూడదని, లేని యెడల నగదు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైనా నగదు తరలింపునకు తప్పనిసరిగా ఆధారాలను వెంట ఉంచుకోవాలని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి సూచించారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా దిచక్ర వాహనంపై రూ.4లక్షల నగదును తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలను చూపించక పోవడంతో అతని వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పగించినట్లు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని బస్ డిపో వద్ద తనిఖీల్లో ఎలాంటి రసీదులు లేకుండా రూ.1,47వేల విలువ గల 490 చీరలను వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా వ్యాపారరీత్యా లేదా ఆసపత్రితో పాటు ఏదైనా అత్యవసర పరిస్థితిల్లో రూ.50వేలకు పైగా డబ్బులు తరలిస్తే తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు, రశీదులు, ఆధారలతో డబ్బును తరలించాలని సూచించారు. తనిఖీలో పాల్గొన్న వారిలో కానిస్టేబుల్ మహేందర్, సిబ్బంది ఉన్నారు.



11న ఉమ్మడి జిల్లా మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 7: ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆద్వర్యంలో మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 11న నిర్వహించనున్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సాయంత్రం 4 గంటల నుంచి ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ గణపతి తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, మంచిర్యాల జిల్లాలో ఈనెలలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటిల్లో పాల్గొనుటకు ఆసక్తిగల క్రీడాకారణిలు ఆదార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో మైదానంలో జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్యకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9849114956 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఎస్సారెస్పీ ఉపకాలువలో ట్రాక్టర్ బోల్తా

● ఇద్దరు యువకుల దుర్మరణం



బోల్తా పడ్డ ట్రాక్టర్ కింద చిక్కుకున్న యువకులు



రాజేష్ (ఫైల్)



షేక్ హైమద్(ఫైల్)

మల్లాపూర్, మే 7: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని హస్సేన్ నగర్ శివారులోని ఎస్సారెస్పీ డీ 29 ఉప కాలువలో ప్రమా దవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ రాజేష్(25), షేక్ హైమద్(18)లు ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేటకు చెందిన రాజేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి గతంలోనే మృతి చెందాడు. దీంతో తల్లిని పోషించాల్సిన బాధ్యత రాజేష్‌పై పడింది. ఇక హస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ హైమద్ ఇటీవల పదో తరగతి పాస్ అయ్యాడు. మంగళవారం మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులోని మామిడి తోట నుంచి హస్సేన్‌నగర్ గ్రామ శివారుకు మొరం తరలించేందుకు రాజేష్ వెళ్లాడు. రాజేష్‌తో పాటు హైమద్ కూడా తోడు వెళ్లాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఎస్సారెస్పీ డీ 29 కాలువలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరూ ట్రాక్టర్ ఇంజన్ కింద చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామస్థులు గమనించి ఇరు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. యువకుల మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో రాజేష్ తల్లి రోదిస్తున్న తీరు కంట తడి పెట్టించింది.

మానేరులో ఈతకు వెళ్లి ఒకరి మృతి

తిమ్మాపూర్, మే7: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలో ఈతకు వెళ్లి ప్రమాదవశత్తు ఒకరు మరణించారు. స్థానికులు, ఎల్ఎండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం కరీంనగర్‌లో జరగాల్సిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ కోసం ఫ్లెక్సీలు కట్టేందుకు హైదారాబాద్ నుంచి సోమవారం పది మంది యువకులు కరీంనగర్ వచ్చారు. ఫ్లెక్సీలు కట్టిన తరువాత మంగళవారం మధ్యాహ్నం అందురు కలిసి దిగువ మానేరు డ్యాంలోకి ఈత కొట్టేందుకు వెళ్లారు. అందులో ఒక వ్యక్తి హైదారాబాద్, బాలనగర్‌లోని స్నేహపురి కాలనీకి చెందిన సింగారం రమేష్(28) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండి ఎస్సై చేరాలు వివరాలు సేకరించి మృతదేహన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

శంకరపట్నం, మే7: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శంకరపట్నం మండలంలోని అంబాలాపూర్‌కు చెందిన గొల్లెన సమ్మయ్య (53) అప్పులు చేసి ఇల్లు నిర్మించాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి గురై ఈ నెల 6న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు హుటాహుటిన 108వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

వీణవంక,మే07:మండలంలోని వల్భాపూర్ గ్రామనికి చెందిన పోతరాజు పోచాలు(45) అప్పుల బాధతో పురుగల మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసుల వివరాల ప్రకారం తనకున్నా వ్యవసాయ భూమిలో మొక్క జోన్నవరి పంట వేయగా సరైన దిగుబడి రాక బంధువుల వద్ద తెచ్చిన అప్పుల ఎలా తీర్చాలని జీవితం పై విరక్తి చెంది ఈ నెల 1వ తేదిన గడ్డి మందు త్రాగాగ చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ అసుపత్రికి తరలించగా చికిత్స పోందుతు మృతి చెందినట్టు తెలిపారు.మృతుని భార్య పోతరాజు సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

పొలాల్లో చెలరేగిన మంటలు

ఎల్లారెడ్డిపేట, మే 7: ఎల్లారెడ్డిపేట శివారులోని వ్యవసాయ పొలాల్లో మంగళవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పొలాల్లో మంటలు చెలరేగాయి. సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట కోసిన గడ్డితో పాటు రైతులకు చెందిన విద్యుత్ స్టార్టర్లు, సాగునీటి పైపులు, విద్యుత్ సర్వీస్ వైర్లు, పశుగ్రాసం కాలిపోయాయి. అప్రమత్తమైన రైతులు మంటలను ఆర్పివేయడంతో భారీ ప్రమాదం తప్పినట్లయింది. వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొంటున్నారు.

జగిత్యాలలో చోరీ

జగిత్యాల టౌన్,మే7: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో మంగళవారం చోరీ జరిగింది. దొంగలు లావణ్య అనే మహిళా ఇంట్లో చొరబడ్డారు. ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న తులంన్నర బంగారంతో పాటు రూ. 20 వేల నగదు అపహరించుకవెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గల్ఫ్ కార్మికులను మోసం చేసిన బీఆర్ఎస్, బీజేపీ

● తెలంగాణ గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్‌రెడ్డి

ధర్మపురి, మే 7: బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు గల్ఫ్ కార్మికులను మోసం చేశాయని తెలంగాణ గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి ఆరోపించారు. ధర్మపురి పట్టణంలో టీపీసీసీ ఎన్నారై సెల్ ఇంటర్ నేషనల్ కన్వీనర్ మంద భీంరెడ్డితో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్ఫ్ బోర్డు, ఎన్నారై పాలసీ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేసి సీఎం రేవంత్‌రెడ్డి నిబద్ధత చాటుకున్నారన్నారు. గ్రామాల్లోని గల్ఫ్ కార్మికుల కుటుంబ సభ్యులు, గల్ఫ్ రిటనీలు వేసే ప్రశ్నలకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమాధానం చెప్పే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. గల్ఫ్ దేశాలలో మృతి చెం దిన వలస కార్మికుల కుటుంబాలకు రూ 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిం పునకు కాంగ్రెస్ పార్టీ వేములవాడలో ప్రారంభించిందన్నారు. హైదరా బాద్‌లో జరిగిన గల్ఫ్ భరోసా ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సీఎం గల్ఫ్ బోర్డు ఏర్పాటు, సమగ్ర ఎన్నారై పాలసీ గురించి స్పష్టమైన ప్రకటన చేసినట్లు ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్‌లో సౌదీ అరే బియా, కువైట్ దేశాల కాన్సులేట్లు ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. గల్ఫ్ కార్మికులను దోచుకున్న బీజేపీ ప్రభుత్వానికి కార్మికుల కుటుంబాలు బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. టీపీసీసీ ఎన్నారై సెల్ ఇంటర్ నేషనల్ కన్వీనర్ మంద భీంరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఎమిగ్రేషన్ ఆఫీస్ ఏర్పాటు చేసి గల్ఫ్ కార్మికులను ఆదుకున్న అప్పటి కేంద్ర దివంగత మంత్రి వెంకటస్వామి సేవలను కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు గల్ఫ్ కార్మికులు అండగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఎన్నా రై సెల్ ఇంటర్ నేషనల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎనగంటి హరీష్, మాదం వినోద్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రమ్మీకి బానిసై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

● రూ.12 లక్షల అప్పుతో మనోవేదన



పృథ్వీ(ఫైల్)

గంగాధర,మే 7: ఆన్‌లైన్ రమ్మీకి బానిసగా మారిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ.12 లక్షలు అప్పు చేసి తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలానికి చెందిన నాగుల లక్ష్మణ్, లక్ష్మి దంపతులు 30 సంవత్సరాల క్రితం గంగాధర మండల కేంద్రంలోని మధురానగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. లక్ష్మణ్ ఆటో నడుపుకుంటూ కూతురికి పెళ్లి చేయగా కుమారుడు పృథ్వీ(28)ని ఇంజనీరింగ్ చదివించాడు. పృథ్వీ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించాడు. రెండు నెలల క్రితం ఉద్యోగం నిమిత్తం పృథ్వీ ఉత్తరప్రదేశ్ వెళ్లాడు. ఆన్‌లైన్ రెమ్మీకి అలవాటు పడిన పృథ్వీ స్నేహితుల వద్ద వివిధ కారణాలతో 12లక్షల రూపాయల వరకు అప్పు తీసుకున్నాడు. 15 రోజులుగా ఉద్యోగానికి వెళ్లకుండా రూంలోనే ఉన్నాడు. మొత్తం డబ్బులు పోవడంతో పాటు అప్పు తీర్చే మార్గం లేక మానసికంగా కుంగిపోయి శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రాత్రి మృతదేహం గంగాధరకు రావడంతో మంగళవారం దహన సంస్కారాలు పూర్తి చేశారు. తండ్రి ఆటో నడుపుతూ పిల్లలను ఉన్నతంగా చదివించగా ప్రయోజకుడై చేతికందిన కుమారుడు ఆన్‌లైన్ ఆటలకు బలవడంతో కుటుంబం శోకసంద్రంలో మునిపోయింది.

వైద్యుడిపై సస్పెన్షన్ వేటు

కోరుట్ల, మే 7: కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు శ్రవణ్‌పై వైద్య విద్యాపరిషత్ సస్పెన్షన్ వేటు వేసినట్లు డీఎస్‌హెచ్ఎస్ జిల్లా అధికారిణి సుదక్షతన దేవి మంగళవారం తెలిపారు. గత నాలు రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటనపై విచారణ జరిపి ఉన్నత అధికారులకు నివేదిక పంపడంతో వైద్య విదాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ అదేశాల మేరకు సస్పెండు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. వైద్యుడు శ్రావణ్ విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగా అతడిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

బాలుడి కిడ్నాప్

● తప్పించుకొని ఇంటికి చేరిక

ఇల్లంతకుంట, మే 7: మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి రామ్ చరణ్ (12) అనే బాలుడి కిడ్నాప్ కలకలం సృష్టించింది. బంధువుల వివరాల ప్రకారం.. రామ్‌చరణ్ సోమవారం మధ్యాహ్నం జంగమరెడ్డిపల్లె మార్గంలోని ఫంక్షన్ హాల్ సమీపంలో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ కారులో ఉన్నవారు పాల కేంద్రం ఎక్కడ ఉందని హిందీలో ప్రశ్నించారు. హిందీ వచ్చిన రామ్‌చరణ్ కారులో ఎక్కి చూపించడానికి వెళ్లాడు. పాల కేంద్రం వచ్చినా కారు ఆపకుండా వేగంగా వెళ్లింది. జంగమరెడ్డిపల్లె గ్రామం మీదుగా కొంతదూరంలో కారులో ఉన్నవారు మూత్ర విసర్జనకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన రామ్‌చరణ్ తప్పించుకొని ఇల్లంతకుంటకు చేరుకున్నాడు. సోమవారం రాత్రి ఇంటికి చేరిన బాలుడు తల్లి లత ఏడుస్తూ జరిగింది చెప్పాడు. దీంతో మంగళవారం పోలీసులకు సమాచారం అందిం చారు. బాలుడు చెప్పిన వివరాలు సేకరించి విచారణ చేస్తున్నామని ఎస్సై రాజుగౌడ్ తెలిపారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



కొండగట్టులో భక్తులు

మల్యాల, మే 7: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకుని ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

● అన్నదానానికి విరాళం

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన దుంపనపల్లి సతీష్ విరాళం అందించారు. ఈ మేరకు రూ.50వేలను అన్నదానం ఇన్‌చార్జి రాజేందర్‌రెడ్డికి అందించాడు.

గాయపడ్డ యువకుడి మృతి

మెట్‌పల్లి, మే7: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పట్టణంలోని బొల్లవేని రాజేష్(27) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లవేని రాజేష్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రాజేష్ స్నేహితుడు కట్ట మల్లేష్ పని ఉందని ఇంటి నుంచి తన వాహనంపై తీసుకెళ్లాడు. సాయంత్రం తిరిగి రాజేష్‌ను ఇంటి వద్ద వదలడానికి కట్ట మల్లేష్ తన ద్విచక్రవాహనం టీఎస్21ఎల్3367పై ఎక్కించుకుని బయలు దేరారు. ఈ క్రమంలో ఆరపేట శివారులోని శివాలయం వద్ద ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం కింద పడింది. దీంతో రాజేష్‌కు తల, కాళ్లు, చేతులకు బలమైన గాయాలు తగలగా మల్లేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ప్రత్యేక వాహనంలో రాజేష్‌ను చికిత్స కోసం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఆసపత్రికి తరలించారు. రాజేష్ చికిత్స పొందుతూ సోమ వారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రధాన మంత్రి మోదీ పర్యటనను అడ్డుకుంటాం

● ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

సిరిసిల్ల టౌన్, మే 7: వేములవాడ పట్టణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను అడ్డుకుంటామని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ పది సంవత్సరాల పాలనలో రూ.14,36,570 లక్షల కోట్లు ధనవంతులకు బ్యాంకుల నుంచి రుణాలను మోదీ మాఫీ చేశారని రైతుల రుణాలను మాత్రం ఒక్క రూపాయి మాఫీ చేయలేదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ దేశ సంపదను దోచి పెట్టడమే కాకుండా దేశ సహజ వనరులను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ఉద్యోగాల ఊసే మరిచారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నడిపించడం చేతకాక ప్రైవేటు పరం చేయడం వల్ల వాటిలో అమలైన రిజర్వేషన్లు రద్దు చేయబడ్డాయని అన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచి పేద ప్రజల నడ్డి విరిచారని ఆరోపించారు. దేవుడు మతం అని చెప్పే ప్రధాని, ఎంపీ బండి సంజయ్ దక్షణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి ఒక్క రూపాయి ఎందుకు మంజూరు చేయలేదో ఇక్క డి ప్రజలకు సమాధానం చెప్పాకే వేములవాడ పర్యటనకు రావాలని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు అవకాశం ఇస్తే దేశ ప్రజల బతుకులు అధోగతిపాలు అవుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులిగంటి వేణుగోపాల్, నాయకులు మోదనపల్లి సాయి, చౌదారపు రాజు, దుబాల కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో మోసం



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు



చందుర్తి సింగిల్ విండో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రాయికల్, మే 7: ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల తూకంలో తరుగు పేరుతో మోసం చేస్తున్నారని కుమ్మరిపెల్లి గ్రామ రైతులు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. తూకంలో ఒక సంచికి 41.100 కిలోల నుంచి 41.200 కిలోల వరకు తూకం వేస్తున్నారని, ధాన్యం మిల్లుకు చేరిన తర్వాత తరుగు పేరిట కిలో నుంచి 2 కిలోల ధాన్యాన్ని తరుగు తీస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ధాన్యం తూకానికి సంబంధించిన ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదని, ఈ విషయమై సొసైటీ అధికారులను సంప్రదించగా దురుసుగా మాట్లాడారని తెలిపారు. తమకు న్యాయం చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తిరుపతి, అంజయ్య, నవీన్, రెడ్డి, రాజేష్, రాజన్న, పవన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల నిరసన

చందుర్తి : చందుర్తి మార్కెట్ యార్డుకు చెందిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువస్తే తూకం వేయడం లేదని చందుర్తి మండల కేంద్రంకు చెందిన రైతులు సింగిల్ విండో ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి నెల 10 రోజులు దాటినా ఇప్పటివరకు తూకం వేయలేదన్నారు. కొన్ని రోజులు గన్ని సంచుల కొరత, ఆ తర్వాత లారీల కొరతతో కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కొనుగోలు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. వర్షంతో లారీలు ఇటువైపు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తూకం వేయకపోవడంతో కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాలకు ధాన్యం నష్టపోయే ప్రమాదం ఉన్నందున వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు లింగాల రాజయ్య, మర్రి రాములు, లింగాల శ్రీనివాస్, పోతరాజు శ్రీనివాస్, లింగాల రాంప్రసాద్, సిరికొండ గంగయ్య, మేడిశెట్టి శంకర్, మార్త రాజు పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్‌కు అనాథ వృద్ధుడు

ఎల్లారెడ్డిపేట ,మే 7: నా అనేవారు ఎవరూ లేని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అనాథ వృద్ధుడు పాకాల సుబ్బారావు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో మంగళవారం చేరాడు. కొంత కాలం క్రితం ఉపాధి నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా నుంచి సిరిసిల్ల పట్టణానికి ఆయన తన భార్య లక్ష్మీతో కలిసి వలస వచ్చాడు. ఇటీవల అతని భార్య లక్ష్మి అనారోగ్యంతో మరణించింది. భార్య చనిపోవడంతో సుబ్బారావు ఒంటరిగా మిగిలాడు. అతని దీనస్థితిని తెలుసుకున్న సిరిసిల్లకు చెందిన పాస్టర్ యోహన్ మండల కేంద్రంలోని తోటి పాస్టర్ మధుకు సమాచారం అందించాడు. అనాథ వృద్ధుడు సుబ్బారావు పరిస్థితిని స్థానిక మాజీ ఎంపీటీసీ బాలరాజు దృష్టికి తీసుకెళ్లాడు. దాంతో ఆయన వృద్ధుల డే కేర్ సెంటర్ కోఆర్డినేటర్ మమతకు పరిస్థితిని వివరించాడు. సుబ్బారావును డే కేర్ సెంటర్‌లో చేర్చుకున్నారు.

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని గుర్తించిన కుటుంబీకులు

కరీంనగర్ క్రైం, మే7: కరీంనగర్ తీగల వంతెనపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని కుటుంబ సభ్యులు గుర్తించారని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడు గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటకు చెందిన గాజులపల్లి రాజనర్సు(42)గా కుటుంబ సభ్యులు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 5న ఎవరికీ చెప్పకుండా కరీంనగర్‌కు చేరుకుని జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కొడుకు దిలీప్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

అభివృద్ధిపై దృష్టి సారించని బీజేపీ ప్రభుత్వం

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రకమిటీ సభ్యుడు జె వెంకటేష్

భగత్‌నగర్, మే 7: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించలేదని, మతోన్మాద పార్టీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేష్ అన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ అభివృద్ధిపై దృష్టిపెట్టకుండా కేవలం మతాన్ని అడ్డుపెట్టు కుని రాజకీయ పబ్బం గడుపుతుందన్నారు. 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను మార్చుతామని బీజేపీ మంత్రులే బాహాటంగా ఉపన్యాసాలు ఇస్తున్నారన్నారు. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతు తెలుపుతూ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి మాట్లాడుతూ వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐలకు గ్రామ స్థాయిలో కార్యకర్తలు ప్రజాసంఘాలు ఉన్నాయన్నారు. నిస్పక్షపాతం గాపేదల కోసం అనునిత్యం పోరాటాలు చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సదస్సులో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వామపక్ష పార్టీలు కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తామనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శిమిల్కూరి వాసుదేవరెడ్డి, మూసం రమేష్, రాములు, శివరాజ్, గీట్లముకుందరెడ్డి, వర్ణవెంకట్‌రెడ్డి, గుడికం దుల సత్యం, బీమాసాహెబ్, శ్రీనివాస్, ఎడ్లరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గంటలు ఆలస్యంగా టీఎస్ ఎప్‌సెట్

● విద్యార్థుల తల్లిదండ్రుల అందోళన



దర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



పరీక్ష రాసి బయటికి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్, మే7: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మే 7,8 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల కోసం, మే 9,10,11 తేదీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కొరకు పరీక్షలు ఉన్నాయి. అయితే కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టులలో నిర్వహిస్తున్నారు. ఉదయం, మధ్నాహ్నం సెషన్‌లలో జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలలో ప్రశాంతంగా ముగిశాయి. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో మాత్రం సుమారు 1.50 నిమిషాలు మధ్యాహ్నం సెషన్ పరీక్ష అలస్యంగా ముగిసింది. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరగాల్సిన పరీక్ష సుమారు రాత్రి 7.50కు వరకు కొనసాగింది. 6గంటలకు పరీక్ష ముగిసే సమయానికి విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కోసం పరీక్ష కేంద్రం వద్దకు చేరుకొనే సరికి అధికారులు ఇంకా గంట సమయం పడుతుందని, పరీక్ష రాసేటప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, అందోళన చెందవద్దని తల్లిదండ్రులకు సూచించారు. దీంతో కొందరు విద్యార్థుల తల్లింద్రులు హైరానా పడి అన్‌లైన్ పరీక్ష 6గంటలకే ముగుస్తుందని, తమ పిల్లలు లోపల పరీక్ష రాస్తున్నారో లేదో అని ఆందోళనకు గురై ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రం ముందు రాజీవ్ రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. దీంతో రోడ్డుకు ఇరుపక్కలా పెద్ద ఎత్తున ట్రాఫిక్ జాం అయింది. విద్యార్థులు పరీక్ష రాసి సుమారు రాత్రి 7.50 అనంతరం బయటకు వచ్చారు. రాస్తారోకో వద్దకు తిమ్మాపూర్ సిఐ స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు తమ సిబ్బందితో చేరుకొని తల్లిదండ్రులతో మాట్లాడి ధర్నాను విరమింపచేశారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విద్యుత్ సరాఫరాలో అంతరాయం

గాలి దుమారంతో సాయంత్రం 4.20 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. జనరేటర్ కూడా సకాలంలో సహకరించక పోవడంతో సర్వర్‌తో పాటు సిస్టమ్స్ అగిపోయాయి. జనరేటర్ మరమ్మతులు చేసిన అనంతరం 5.30గంటలకు తిరిగి పరీక్ష ప్రారంభం అయి సుమారు 7.50 గంటల వరకు కొనసాగించారు. ఈ విషయమై ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండ్ శ్రీధర్‌రెడ్డిని వివరణ కోరగా వర్షం కారణంగా పరీక్ష కేంద్రం సమీపంలో పిడుగుపడి ఒక్క సారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

8లోగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

పెద్దపల్లిటౌన్, మే 7: పార్లమెంట్ ఎన్నికలలో పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్న వారు తమ ఓటు హక్కును ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం నందు మే 8లోగా వినియోగించుకోవాలని పెద్దపల్లి సహాయ ఎన్నికల అధికారి బి.గంగయ్య తెలిపారు. పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద మంగళవారం పెద్దపల్లి సహాయ ఎన్నికల అధికారి బి.గంగయ్య పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి ఎంచుకున్న వారందరూ మే 8 లోపు వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

కల్వచర్లలో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

రామగిరి, మే 7: మండలంలోని కల్వచర్లలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు శంకేషి రవీందర్, పూదరి సత్యనారాయణగౌడ్‌ల ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలను కలిసి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకొవాలని విజ్ఞప్తి చేశారు. మ్యాదరవేని కుమార్‌యాదవ్, కాపురబోయిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి మాదిగ శక్తి మద్దతు

పెద్దపల్లిటౌన్, మే 7: పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు రెండు స్థానాలను కేటాయించిన బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మాదిగ శక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్నీ ప్రకటించారు. ఈ మేరకు నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆధ్వర్యంలో కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాదిగ శక్తి నాయకులు బుల్లెట్ సుజీత్ రావణ్, కళ్ళేపల్లి రవి, బొటుకు రమేష్, తది తరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన దేవ వెంకటేశం

యైటింక్లయిన్‌కాలనీ, మే 7: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి ఇటీవల రాజీనామా చేసిన చర్చల కమిటీ మాజీ ప్రతినిధి, సీనియర్ నాయకుడు దేవ వెంకటేశం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం రాత్రి మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయనకు వారు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఐదు నెలల్లోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత

కాల్వశ్రీరాంపూర్, మే 7: అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాల్వశ్రీరాంపూర్, మల్యాల, పెగడపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు గొడుగు రాజ కొమురయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, మే 7: మండలంలోని చిన్న రాతుపెల్లి, పెద్దరాతుపెల్లి, ఇదిలాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఉపాధిహామీ పనుల వద్ద ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకి ఓటు వేయాలని కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, సింగిల్ విండో ఛైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఓరుగంటి కొమురయ్య, శ్రీపతి మొగిలి, సబ్బాని రాజమల్లు, దాసరి నరేందర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్ ప్రచారం

గోదావరిఖని, మే 7: బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో సుడిగాలి ప్రచారం చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు. ఉదయం కూరగాయల మార్కెట్‌లో కొప్పుల ఈశ్వర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 2ఏ బొగ్గు గనిపై సింగరేణి కార్మికులను, కోర్టు ఆవరణలో న్యాయవాదులను కలిసి ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థించారు. 9వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ప్రచారంలో పాల్గొన్నారు. బస్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్‌లో జరిగిన ఆటోడ్రైవర్ల సమావేశంలో పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు. జనగామలో జరిగిన ప్రచార కార్యక్రమలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, పెంట రాజేష్, మాదాసు రామమూర్తి, నామ్‌తాబాద్ కిరణ్‌జీ, కార్పొరేటర్ జనగామ కవితసరోజిని తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని విముక్తి చేయాలి

మంథని, మే 7: బీజేపీ బందీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై యాకయ్య, కమ్యూనిస్టు నాయకుడు, న్యాయవాది కే. రఘోత్తంరెడ్డిలు పిలుపునిచ్చారు. బీజేపీ బందీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం.. అనే బుక్‌లెట్‌ను సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కులం, ప్రాంతం, మతం, పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య అనైక్యతను సృష్టిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, యువకులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. ప్రజలందరూ బీజేపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ఇండియా కూటమిలో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్, ఆర్ల సందీప్, బావు రవి, విరుగురాల ప్రసాద్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధును అడ్డుకున్న బీజేపీ, బీఆర్ఎస్‌లు

- విభజన చట్టాన్ని అమలు చేయని బీజేపీ - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, మే 7: రైతుల కోసం తమ కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరుచేయించిన రైతు బంధు డబ్బులను బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుట్ర పూరితంగా అడ్డుకున్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. మంథనిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. బీజేపీ ఎన్నికల కమిషన్‌ను వాడుకొని రైతుల ఖాతాలో జమ చేసిన రైతు బంధు డబ్బులను ఫ్రీజ్ చేయించిందన్నారు. ఈ స్కీం కొత్తది కాదని ఇదివరకే కొనసాగుతున్న స్కీం అని,దీన్ని అడ్డుకోవడం రైతుల నోట్లో మట్టి కొట్టడమే అని అన్నారు. రైతు బంధును అడ్డుకోవడంపై ఎందుకు ఆపారో రైతులకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను రైతులు గమనించి ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పూర్తిగా దిగదార్చిందన్నారు. వారు అధికారంలో ఉండగా ఎన్నికల సమయంలో సైతం రైతు బంధు ఇచ్చి ఇప్పుడు తమ ప్రభుత్వంలో ఎందుకు అడ్డుకున్నారో జవాబు చెప్పాలన్నారు. ఈసీని అడ్డుపెట్టుకొని రెండు పార్టీలు చేస్తున్న కుట్రలను రైతులు గమనించాలన్నారు. రైతులకు భరోసా కల్పించడానికే ఈ పథకాన్ని అమలుచేస్తుంటే రాజకీయ లబ్ధి కోసం అడ్డుకుంటున్నారన్నారు. కేంద్రంలో మరోసారి అధికారంలోకి వస్తే బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను మార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను ఎత్తివేసే ఆలోచనతో ప్రజలను ఎలా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ దేశంలో జనబా ప్రాతిపదికన రిజర్వేషన్లను అమలుచేయడానికి కులగణనకు శ్రీకారం చుట్టడానికి ప్రయత్నాలు చేస్తుంటే బీజేపీ రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలు చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో సైతం కులగణనకు తమ ప్రభుత్వం క్యాబినెట్ ఆమోదంతో పాటు నిధుల మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, ఉచితవిద్యుత్, రూ.500లకే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను అమలు చేస్తుంటే రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ అవగాహన లేకుండా ఆరోపణలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోగా విభజన చట్టం హామీలను ఒక్కటి కూడా అమలుచేయలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేశారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచి అన్ని వర్గాలకు అన్యాయం చేశారన్నారు. అంతకుముందు జరిగిన పలు కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెంద్రి రమా-సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, డీసీసీ అధికార ప్రతినిధి శశిభూషన్‌కాచే, నేతలు ఇనుముల సతీష్, వొడ్నాల శ్రీనివాస్, ముస్కుల సురేందర్‌రెడ్డి, కొత్తశ్రీనివాస్, ఆకుల కిరణ్, మూల పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం

జ్యోతినగర్, మే 7 : కాళేశ్వరం ప్రాజెక్టుపై దర్యాప్తునకు ఏర్పాటైన జ్యుడీషియల్ కమిషన్ ఛైర్మన్, రిటైర్డ్ జడ్జి పిసి.ఘోష్‌కు మంగళవారం సాయంత్రం ఎన్టీపీసీలో ఘన స్వాగతం లభించింది. కాళేశ్వరం మేడిగడ్డలో పర్యటించి ఎన్టీపీసీ పీటీఎస్‌లోని జ్యోతి భవన్(వీఐపీ గెస్ట్‌హౌజ్)కు వచ్చిన రిటైర్డ్ జడ్జి ఘోష్‌కు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపుకలెక్టర్ అరుణశ్రీ, ఎన్టీపీసీ అధికారులు స్వాగతం పలికారు. రాత్రి బస చేసి బుధవారం వెళ్లనున్నట్లు సమాచారం.


రిటైర్డ్ జడ్జి పీసీ ఘోష్‌కు స్వాగతం చెబుతున్న కలెక్టర్

బీజేపీ,కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలి

కమాన్‌పూర్, మే 7 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలని పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కార్నర్ మీటింగ్‌లో కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ గెలిస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ప్రచారం

ముత్తారం మే 7: మండలంలోని మైదబండ గ్రామంలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా జడ్పీ ఛైర్మన్ పుట్ట మధూకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత

ఎలిగేడు, మే 7 : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమె ఎలిగేడు గ్రామాన్ని సందర్శించారు. ప్రస్తుత సీజన్‌లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని, చిన్న, పెద్ద సమస్యలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి పరిష్కార మార్గం సుగమమం చేయాలన్నారు. తాగునీటి బావులు హ్యాండ్ బోర్లు, పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. అనంతరం ఎలిగేడు ఎస్సీ కాలనీని సందర్శించి తాగునీటి సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాటర్ హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని సీజనల్ వ్యాధులైన కలర, విషజ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని, విపరీతమైన ఎండ తీవ్రత ఉన్న దృష్ట్యా ప్రజలు ఉపాధిహామీ కూలీలు జాగ్రత్తగా ఉండాలని వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆమెతో పాటు పంచాయతీ కార్యదర్శి ఆకుల సౌమ్య, కారోబార్ సత్యంలు ఉన్నారు.

సుల్తానాబాద్ : మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత మంగళవారం పర్యటించారు. ఈనెల 13న జరుగునున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఓటర్లకు ఇబ్బంది కలుగకుండా పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. విద్యా శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన పనులను, శ్మశానవాటిక పనులు, నర్సరీలను మంచినీటి సరఫరా విధానాన్ని, బోరింగ్‌లు పని చేయడం గురించి తెలుసుకున్నారు. ఆమె వెంట కార్యదర్శి సోనియా, కారోబార్ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.


ఎలిగేడులో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత


వాటర్ బాట్లింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న సీజీఎం

సుల్తానాబాద్ సొసైటీని సందర్శించిన నాబార్డ్ సీజీఎం

సుల్తానాబాద్, మే 7: సుల్తానాబాద్ సహకార సంఘాన్ని మంగళవారం నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్ర సందర్శించారు. సీజీఎంతో పాటు అధికారుల బృందం సొసైటీలో పర్యటించి రైతులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు రుణాలు, విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు వారి కుటుంబాలకు అవసరమైన అన్ని సౌకర్యాల కల్పిస్తున్నామంటూ సొసైటీ ఛైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ వివరించారు. రుణాల రికవరీ విధానాన్ని, సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ బాట్లింగ్ యూనిట్‌ను, సూపర్ మార్కెట్‌ను, గోదాములను సీజీఎం తదితరులు పరిశీలించి సొసైటీ పాలకవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో పాటు పీడీసీ రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ, సాగర్‌రెడ్డి, సీఈవో బూరుగు సంతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీలను ఓడించాలి : న్యూడెమోక్రసీ

కళ్యాణ్‌నగర్, మే 7: మరోసారి ఆర్ఎస్ఎస్, బీజేపీ అధికారంలోకి రానివ్వకుండా చిత్తుగా ఓడించండని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఐ కృష్ణ, ఈ నరేష్‌లు ప్రచారం నిర్వహించి మాట్లాడారు. దేశంలో మతోన్మాద ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభుత్వ పాలనలో అనేక ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటుపరం చేసిందని, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతులను బానిసలుగా చేసే కుట్ర పన్నిందన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా చేసిందన్నారు. మైనార్టీలపై, క్రైస్తవులపై, మహిళలపై, దళితులపై దాడులు సాగుతున్నాయన్నారు. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. ఇలాంటి పరిస్థితులలో మరోసారి మతోన్మాద ఆర్ఎస్ఎస్, బీజేపీ, ఎన్డీఏ కూటమి ఈ పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావాలని అనేక కుట్రలు, కుయుక్తులు చేస్తున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అధికారంలోకి రాకుండా కూటమిని చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాయకులు బతుకుల రాజన్న, ఎం కొమరయ్య, సీహెచ్ అబెద్నెగో, ఎడ్ల రవికుమార్, ఐ సాంబయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ : మత రాజకీయాలు, ఫాసిస్టు పాలన చేస్తున్న బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీపీసీ పీటీఎస్‌లో ప్రచారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు, ఐఎఫ్‌టీయూ నాయకుడు చిలుక శంకర్ ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లోని కాంట్రాక్టు కార్మికులతో సమావేశమయ్యారు. కార్మిక, ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతున్న బీజేపీని ఓడించాలని, పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని తీర్మానించారు. ప్రతిపక్ష పార్టీలు,విప్లవ సంఘాలపై నిర్బంధాన్ని విధిస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని శంకర్ కోరారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం రవిందర్, డి.సత్యం, సుధాకర్, నర్సయ్య, రాయమల్లమ్మ, శంకరమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మూడోసారి మోదీ సర్కార్

- రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ


మాట్లాడుతున్న రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ

మంథని, మే 7: కేంద్రంలో మూడోసారి సైతం ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ అధికారంలోకి రావడం ఖాయమని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ వెల్లడించారు. మంథనిలో మంగళవారం పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో సీఎం భజన్ లాల్ శర్మ మాట్లాడుతూ.. 400 సీట్లతో బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారం చేపట్టబోతున్నదన్నారు. రాజస్థాన్ డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోందన్నారు. తెలంగాణలో కూడా డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతుందన్నారు. పేదలు, రైతులు, కార్మికుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందన్నారు. పెద్దపల్లిలో గోమాసే శ్రీనివాసును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశం అభివృద్ధి చెందాలంటే నరేంద్ర మోదీ మూడవసారి ప్రధానమంత్రి కావాలన్నారు. దేశంలో అభివృద్ధి, గరీబ్ కళ్యాణ్ యోజన ప్రధాని నరేంద్ర మోదీ తోటే సాధ్యమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదన్నారు. అధిక సంఖ్యలో సభకు ప్రజలు వచ్చినప్పటికీ గాలి దుమారం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నామరు. గొమాసే శ్రీనివాస్ మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గంలో చాలా సంవత్సరాలుగా దుదిళ్ల కుటుంబ పాలన కొనసాగుతోందని, ప్రజలకు మేలు చేసే ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు తనకు చాలాసార్లు రాజకీయంగా అన్యాయం చేశారన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, నేతలు దుగ్యాల ప్రదీప్‌రావు, వినోద్ సెల్వం, నరేందర్‌రెడ్డి, రమేష్, సుహాసిని, పోతరవేన క్రాంతికుమార్, నాంపెల్లి రమేష్, కొండపాక సత్యప్రకాష్, మల్కా మోహన్‌రావు, కందుల సంధ్యారాణి, చల్లా నారాయణరెడ్డి, బోగోజు శ్రీనివాస్, మట్ట శంకర్, రాము, పర్వతాలు పాల్గొన్నారు.

● గాలి దుమారానికి కూలిన టెంట్లు..

గాలి దుమారం, వర్షం కారణంగా టెంట్లు కూలిపోవడంతో సభను అర్ధంతరంగా నిలిపివేశారు. గాలి దుమారం తీవ్రత కారణంగా టెంట్లు కూలిపోయే ప్రమాదాన్ని గమనించిన జనం ముందే టెంట్ల నుంచి బయకు వెళ్లిపోయారు. దీంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. జనం రోడ్డుపైకి వెళ్లి తిరుగు ప్రయాణమవుతున్న క్రమంలో బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ ప్రచారం రథంపై జనం వద్దకు చేరుకొని రోడ్డుషోలో మాట్లాడారు. ఈక్రమంలో సీఎం భజన్‌లాల్ శర్మ హెలికాప్టర్ సభా ప్రాంగణం వద్దకు చేరుకుంది. అయితే వాతావరణం సరిగా లేకపోవడంతో కాసేపు గాలిలో చెక్కర్లు కొట్టి ఎట్టకేలకు సభా ప్రాంగణానికి సమీపంలోని హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, ఇతర ముఖ్య నేతలు హెలిప్యాడ్ వద్దకు చేరుకొని సీఎం భజన్‌లాల్ శర్మకు స్వాగతం పలికారు. అనంతరం కాన్వాయి ద్వారా సీఎం శర్మ సభా ప్రాంగణానికి చేరుకొని అక్కడే ప్రచారం రథం పైన జనం, పార్టీ క్యాడర్‌ను ఉద్దేశించి కొద్ది సేపు ప్రసంగించి వెళ్లిపోయారు.

సింగరేణిని ముంచింది కేసీఆర్

- రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ కుట్ర..

- విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్

గోదావరిఖని, మే 7: తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ సింగరేణిని ముంచారని, ఒక్క కొత్త ప్రాజెక్టు తీసుకురాకపోగా కోయగూడెం గనిని తనకు సంబంధించి అరబిందో కంపెనీకి కట్టబెట్టారని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వస్తే సింగరేణి బాగుపడుతుందని ఆశించారని, కానీ బీఆర్ఎస్ పాలనలో సింగరేణిని అధోగతి పట్టించారన్నారు. ఆస్ట్రేలియాలో కొత్త గనులు తవ్వి బొగ్గు తెస్తామని చెప్పారని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామని, మారుపేర్ల సమస్యలు పరిష్కరిస్తామని వాగ్దానం చేసి మరిచిపోయారన్నారు. తొమ్మిదేళ్ల నరేంద్ర మోదీ పంచన చేరి రాష్ట్రానికి కాజిపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, ఐటీఐఆర్ ఇవ్వకున్నా కూడా నోరు మెదపలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సంపదను దోచి కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టిందన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని మోదీ ప్రయత్నిస్తున్నాడన్నారు. మరోసారి బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయడంతో పాటు రిజర్వేషన్లు కూడా రద్దు చేస్తారన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను తరిమికొట్టి కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

పాలకుర్తి, మే7: పదో తరగతి ఫలితాలలో యూనివర్సల్ ఐఐటీ ఫౌండేషన్ పాఠశాలకు చెందిన 16మంది విద్యార్థులు 10జీపీఏ సాధించగా మంగళవారం జిల్లా విద్యాధికారిణి డి.మాధవి విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ ఇస్మాయిల్, ప్రిన్సిపాల్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు

రామగిరి, మే7: మంథని జేఎన్టీయూలో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 11 వరకు జరిగే పరీక్షల్లో తొలి రోజు రెండు సెషన్స్‌లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం జరిగిన పరీక్షల్లో వంద మందికి గాను 91 మంది విద్యార్థులు హజరైయ్యారు. మధ్యాహ్నం వంద మందికి గాను 94 మంది విద్యార్థులు పరీక్షలకు హజరైయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకొకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును నిర్వహించారు.

11న మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

సుల్తానాబాద్, మే 7: ఉమ్మడి జిల్లా స్థాయి మహిళల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు శనివారం సాయంత్రం సుల్తానాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ ఎంపిక పోటీలలో ఎంపికైన వారు ఈ నెల లో మంచిర్యాలలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ లో పాల్గొంటారని ఆయన పేర్కోన్నారు. సుల్తానాబాద్ లో జరిగే ఎంపిక పోటీలలో పాల్గొనాలని ఆసక్తి గల వారు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతితో పాస్‌ఫోర్టు ఫోటో జత చేసి ఈ నెల 11న సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో అసోసియోషన్ ఉపాధ్యక్షులు అంతటి శంకర్‌ను సెల్ నంబర్ 98491114956 ద్వార సంప్రదించాలన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

ఎలిగేడు, మే 7: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు ఉన్నాయని జిల్లా ఉద్యానశాఖ అధికారిణి జ్యోతి అన్నారు. ఒకసారి పంటవేస్తే 30ఏళ్లు రాబడి ఉంటుందని ఆమె తెలిపారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ఉద్యానశాఖ రివులిస్ కంపెనీ ఆధ్వర్యంలో ముప్పిరితోట గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులు ఆయిల్‌పామ్ పంట వేయడానికి ముందుకు రావాలని, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకసారి పంట వేస్తే చీడ పీడల బారిన పడకుండా ఉంటాయన్నారు. మొక్క నాటిన ఏడాది నుంచి 4ఏళ్ళకు పంట వస్తుందన్నారు. త్వరలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతిపల్లిలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, ఏఈవో పద్మ, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష, రీవులిస్ డ్రిప్ ఇరిగేషన్ అగ్రాణమిష్టు రహమాన్, కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, ఫీల్డ్ స్టాఫ్ సతీష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ, మే 7: కాకతీయ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరిగింది. 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఆనాటి పాఠశాల కరస్పాండెంట్ పడాల యాదగిరి, హెచ్ఎం రత్నాకర్‌లతో పాటు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో రవికుమార్, నీలం సురేష్, వెంకటస్వామి, పడాల రాధిక, రజిత, యాదలక్ష్మి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లి కల్చరల్, మే7: వేసవి కాలంలో పిల్లలు ఉల్లాసంగా గడిపేందుకు రూమ్ టు రీడ్ సంస్థ ప్రతి రోజు ఒక కొత్త కథ ఆడియో రూపంలో అందిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలోని తన చాంబర్‌లో రూమ్ టు రీడ్ ఉల్లాస సమయం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, రీడ్2 రూమ్ సంస్థ రాష్ట్ర హెడ్ నరసింహాచారి, పాఠశాల అకడమిక్ అధికారి పీఎం షేక్, రీడ్ రూమ్ సంస్థ రాష్ట్ర ప్రతినిధులు తేజస్వి, మధు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'మాదిగల ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్‌కు లేదు'

పెద్దపల్లిటౌన్, మే7: ఒకే కుటుంబానికి మూడు పదవులు ఇచ్చి, మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీకి మాదిగల ఓట్లు అడిగే అర్హత లేదని భారతీయ జనతా పార్టీ దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సదానందం మాట్లాడుతూ రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ మూడు, బీఆర్ఎస్ రెండు ఇవ్వగా కాంగ్రెస్ ఒక్కరికి కూడా టికెట్ కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాసుకు మాదిగలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని, భారీ మెజారిటీతో శ్రీనివాసును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వడకాపురం ఆనంద్, బండ కరుణాకర్, కుక్క వంశీ, మల్యాల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

జ్యోతినగర్, మే 7: మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం వెంటనే పూడ్చాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్(టీఏడీయూ) రాష్ట్ర అధ్యక్షుడు గుడిమల రవికుమార్, తెలంగాణ రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు మంద రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఒక ఫంక్షన్‌హాల్‌లో ఆటో కార్మికుల హక్కుల సాధన రాష్ట్ర మహాసభ నిర్వహించారు. గుడిమల రవికుమార్, మంద రవికుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఆటో డ్రైవర్లకు మహాలక్ష్మి పథకం ద్వారా జరిగిన నష్టంపై ప్రతిపక్షం కూడా ఒత్తిడి తేవాలని నాయకులు తీర్మానించారు. ఈకార్యక్రమంలో బోదాసు నర్సింహులు, జేరుపోతుల కుమార్, నల్లమస సాయి, దార మధు, వేల్పుల నరేష్, జీడి శ్రీనివాస్, మాతంగి శివరాజ్, కాంపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో రోడ్డు ప్రమాదం

- ఐదుగురికి గాయాలు

జ్యోతినగర్, మే 7 : ఎన్టీపీసీ సుభాష్‌నగర్ సమీప రాజీవ్ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రామగుండం వైపు నుంచి వస్తున్న ఆటోను వెనుక వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న గాయత్రి, వీణ, శిరీష, ఆటో డ్రైవర్ కేశవ్, మరో మహిళ గాయపడ్డారు. గాయపడిన ఐదుగురిని గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఎవరికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. అంతర్గాంలోని పోచమ్మ గుడికి వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎన్టీపీసీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.